తుపానుపై అప్రమత్తం



కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఎస్‌ఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్తు కార్యాలయంలో రానున్న మూడు రోజుల పాటు 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామన్నారు. 94906 10022 నంబరుకు వినియోగదారులు చేసి ఫిర్యాదులు, సమాచారం, అధికారులను సంప్రదించవచ్చన్నారు. వర్షాలు, గాలులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. స్తంభాలు, తీగలకు దగ్గరలో ఉండే చెట్టు కొమ్మలను తాకవద్దన్నారు. సరఫరాలో అంతరాయం కలిగినా, సమస్యలు ఎదురైనా కంట్రోల్‌రూము గాని, సెక్షన్ కార్యాలయంలో గాని, టోల్ ఫ్రీ సంఖ్య 1912కు గాని వివరాలు తెలియజేయాలన్నారు.

నిరుద్యోగ యువత జీవనోపాధికి బాటలు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలోని ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని నిరుద్యోగ యువత జీవనోపాధికి బాటలు వేసేలా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. అంకుపాలెం రహదారిలోని ఫ్యాషన్ టెక్నాలజీ భవనాలను మంగళవారం పరిశీలించారు. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన యువకులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు కేంద్రం ఏర్పాటు కానుందన్నారు. భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ప్రస్తుతం ఈ భవనంలో కొనసాగుతున్న వెలుగు కార్యాలయాన్ని తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని భవనంలోకి మార్చనున్నట్లు పేర్కొన్నారు. వృత్తి విద్య నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, ఇంజినీరింగ్ అధికారి శాంతారాం, వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త రత్నప్రభ, ఏపీఎం తిలక్, సీసీలు జయలక్ష్మి, కృష్ణ వెంట ఉన్నారు.



ఫ్యాషన్ టెక్నాలజీ భవనంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

పంటంతా కేళీలు



వరి పంటను పరిశీలిస్తున్న సీడ్స్ కంపెనీ సిబ్బంది

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: నకిలీ విత్తనాలతో వరి సాగు చేసిన రైతులు నష్టపోయారు. పొట్ట దశలో పంటంతా కేళీలు, పొల్లకాయలే ఉండటంతో మోసపోయామని గుర్తించి వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అధికారులు సీడ్స్ కంపెనీ సిబ్బందితో కలిసి మంగళవారం వరి పొలాలను పరిశీలించారు. బుచ్చెయ్యపేటకు చెందిన 15 మంది రైతులు ఈ ఏడాది జులైలో రైతు భరోసా కేంద్రం నుంచి అన్నదాత సీడ్స్ కంపెనీకి చెందిన ఎంటీయూ (7029) స్వర్ణ రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి వరి నారు పోయగా బాగానే మొలకెత్తడంతో ఏ సమస్య లేదని భావించి నాట్లు వేశారు. పంట ఈనే సమయంలో కేళీలు, గింజలు కట్టకుండా పొల్లకాయలు ఎక్కువగా ఉండటం గమనించారు. నకిలీ విత్తనాల వల్లే ఇలా జరిగిందని రైతులు సుంకర వెంకటరమణ, శ్రీను తదితరులు మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు గణేష్‌కు ఫిర్యాదు చేశారు. వరి పంటలను పరిశీలించిన అధికారులు కేళీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి అన్నదాత సీడ్స్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ ప్రతినిధులు మంగళవారం వరి పొలాలను సందర్శించి వెళ్లారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన కశింకోట విద్యార్థులు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో కశింకోట జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన అఖిల్ 60 కేజీల విభాగంలో రజత పతకం, 51 కేజీల విభాగంలో జ్యోతి రోహిత్ కాంస్య పతకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు వేదుల ప్రభాకర్ తెలిపారు. ఈ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అచంట రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

★ అక్టోబర్ 1న మునగపాకలో వినాయక ప్రతిమ ఊరేగిస్తున్న తరుణంలో డీజే బాక్సుల కనెక్షన్లు కలుపుతున్న సమయంలో పోలవరపు శ్యామ్ (22) మరణించారు.

★ అక్టోబర్ 8న అనకాపల్లి మండలం బవులువాడలో భవానీమాత పూజలో విద్యుదాఘాతంతో రోమాల సాయి (19) చనిపోయారు.

★ అక్టోబర్ 4న బుచ్చెయ్యపేట మండలం పి.భీమవరంలో ఈదురు గాలులకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగలడంతో భవానీ శంకర్ (15) మరణించారు.

కాటేస్తున్న కరెంటు తీగలు!

★ ఆందోళన కలిగిస్తున్న విద్యుదాఘాతం కేసులు

★ ఈ నెలలోనే ఎనిమిది మంది మృత్యువాత



ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి

★ అక్టోబర్ 7న నక్కపల్లికి చెందిన ఆకి నారాయణమ్మ (58) కిరాణా వ్యాపారి ఇంటి గేటు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయారు.

★ ఇటీవల అల్లూరి జిల్లాలోని కూంబింగ్‌లో ఉన్న సీఆర్‌పీఫ్ ఏఎస్ఐ ఒకరు అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగిలి చనిపోయారు.

ప్రమాదానికి కారణం	2023-24
పంప్‌సెట్ల వినియోగంలో	2
ఇళ్లల్లో అంతర్గత వైరింగ్ సమస్యలు	6
చెట్లు కొమ్మలు తెగిపడి	4
నిర్మాణ పనుల సమయంలో తీగలకు తగిలి	6
చెట్ల కొమ్మలు కొడుతుండగా తీగలు తగిలి	4
ఫ్లెక్సీలు కడుతుండగా	2
స్తంభానికుంటే స్టే వైరు పట్టుకుని	1

కరెంటు తీగలు కాటేస్తున్నాయి.. ఏమరుపాటు, అజాగ్రత్త కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గతేడాది 25 మంది వరకు విద్యుదాఘాతంతో చనిపోగా ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నాయి. వెలుగులోకి రాని కేసులు ఇంకా చాలానే ఉంటాయి. ఒక్క ఈనెలలోనే అనకాపల్లి జిల్లాలో ఎనిమిది మంది విద్యుదాఘాతంతో చనిపోయారు. వర్షాకాలంలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యుత్తు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ వాటి ఫలితాలు కనిపించడం లేదు.

వర్షాకాలంలోనే ఎక్కువ...

విద్యుత్తు ప్రమాదాలు ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా జరుగుతుంటాయి. వ్యవసాయ మోటార్ల దగ్గర తడిసిన స్విచ్‌లు వేస్తుంటారు. గాలులకు కరెంటు తీగలు వేలాడి అవి తగిలి రైతులు నేలకూలిపోతున్నారు. వినాయక నవరాత్రుల నుంచి వివిధ మాలలు ధరించి పూజలు చేస్తుంటారు. వీరు ఎక్కువగా తడి వస్త్రాలతోనే ఉంటారు. ఈ క్రమంలో కొంతమంది ఏమరుపాటుగా విద్యుత్తు ఉపకరణాలను పట్టుకుని విద్యుదాఘాతానికి గురైనవారు ఉన్నారు. ప్రస్తుతం అయ్యప్ప మాలధారణ పూజలు మొదలయ్యాయి. ఆయా పీఠాలు దగ్గరకు వెళ్లి విద్యుత్తు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణాల సమయంలో పక్కనే ఉన్న తీగలు తగిలి చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇళ్ల మేడలపై దుస్తులు ఆరబెట్టిన సమయంలో ప్రమాదవశాత్తు తీగలకు దుస్తులు తగిలి షాక్‌కు గురవుతున్నవారు ఉన్నారు. ఫ్లెక్సీలు కడుతున్న సమయంలో కరెంటు తీగలు తగిలి మృతిచెందినవారు ఉన్నారు.

ఈ జాగ్రత్తలు అవసరం...

- తడిసిన స్తంభాలను తాకవద్దు.
- విద్యుత్తు లైను తగులుతున్న చెట్లను పట్టుకోరాదు.
- ఇంట్లో స్విచ్‌బోర్డులపై తడిచేతులు పెట్టకూడదు.
- చిన్నపిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలి.



- గాలులు, వర్షాల సమయంలో నేలపై పడిన విద్యుత్తు తీగలను తాకరాదు.
- వాటర్ హీటర్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి. స్విచ్ ఆఫ్‌చేయడంతోపాటు ప్లగ్ బయటకు తీసిన తర్వాతనే ఆ పరికరాన్ని బయటకు తీయాలి.
- ఇంట్లో వాడే ప్రతి కరెంటు వస్తువుకు ఎర్త్ వైర్ తప్పనిసరిగా వాడాలి.

ప్రతినెలా అవగాహన..

విద్యుత్తు ప్రమాదాలపై ప్రతి నెలా 2వ తేదీన మా సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. వర్షాకాలంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్తు పరికరాల వినియోగంలో ఏమరుపాటుగా ఉండకూడదు. విద్యుత్తు సరఫరాలో ఏ సమస్య వచ్చినా 1912 నంబర్‌కి ఫోన్ చేస్తే చాలు. ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించవద్దు.

– గొప్పు ప్రసాద్, ఈపీడీసీఎల్ ఎస్ఈ, అనకాపల్లి

మద్యం తయారీలో మాయలెన్నో!

★ డిస్టిలరీలు కేంద్రంగా అక్రమాలపై సీఐడీ తనిఖీలు ★ పలు రికార్డులు, హార్డు డిస్కులు స్వాధీనం

ఈనాడు, అనకాపల్లి – అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే

వైకాపా హయాంలో మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకు అన్నింటా అడ్డదారులు తొక్కారు. నాసిరకం మద్యం అమ్మి మందుబాబుల ఆరోగ్యంతో ఆటలాడుకున్నారు. డిస్టిలరీల నుంచి అనధికారికంగా మద్యం తరలించి పన్నులు చెల్లించకుండా రూ. కోట్లు కొల్లగొట్టారు. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి వాసుదేవరెడ్డిపై ఇప్పటికే కేసు నమోదు చేశారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారుచేసే డిస్టిలరీల్లో సీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా కశింకోట మండలంలోని విశాఖ, జీఎస్‌బీ డిస్టిలరీల్లో మంగళవారం సీఐడీ తనిఖీలు నిర్వహించింది. గత అయిదేళ్లలో ఈ రెండుచోట్ల ఎంత మద్యం తయారు చేసింది. అధికారికంగా ఎంత అమ్మకాలు చేసిందీ, ఎంత పక్కదారి పట్టించిందీ క్షుణ్ణంగా పరిశీలించారు. పదిమంది అధికారుల బృందం ఈ రెండు యూనిట్లలో రోజంతా సోదాలు చేపట్టి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు నివేదిక ద్వారా అందించేవరకు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

డిస్టిలరీల్లోనే మాయ..: గత అయిదేళ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలు సాగించినా ఎక్కడా డిజిటల్ చెల్లింపులను అనుమతించలేదు. నేరుగా నగదు లావాదేవీలే జరిపేవారు. ఇక్కడే అక్రమాలకు పునాదులు పడ్డాయి. డిజిటల్ చెల్లింపులు జరిగితే లెక్కలు పక్కాగా చెప్పాలి. అదే నగదు అమ్మకాలైతే సర్దుబాట్లు చేసి సొమ్ములు పక్కదారి పట్టించడానికి అవకాశం ఉంటుంది. దీనిపై ఎంత మంది ఫిర్యాదులు చేసినా నాటి సర్కారు పట్టించుకోలేదు. మద్యం దుకాణాల కంటే వాటిని తయారు చేసే డిస్టిలరీల్లోనే ఎక్కువ మాయజాలం చేసేవారు. ఒక డిస్టిలరీలో తయారైన మద్యం కేసులన్నీ అధికారికంగా సరఫరా చేస్తే వాటిపై ఎక్సైజ్ డ్యూటీ చెల్లించాలి. కాని వైకాపా హయాంలో ఓ డిస్టిలరీల్లో లక్ష కేసులు మద్యం తయారీ అయితే అందులో 30 నుంచి 40 శాతం అనధికారికంగా తరలించి అమ్మేసుకునేవారనే ఆరోపణలున్నాయి. ఈ మద్యానికి సంబంధించి ఎలాంటి పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరేవి కావు. నేరుగా అప్పటి ప్రభుత్వ పెద్దల జేబుల్లోకే వెళ్లిపోయేవి. మిగతా 60 నుంచి 70 మద్యం మాత్రమే అధికారికంగా అమ్మకాలు చేసేవారు. డిస్టిలరీ తెప్పించుకున్న ముడిసరకు ఎంత.. వాటితో ఎంత మద్యం తయారుచేశారు.. దుకాణాలకు ఎంత సరఫరా చేశారన్నది నిశితంగా పరిశీలిస్తున్నారు. విశాఖ డిస్టిలరీకి సంబంధించి వైకాపా ముఖ్యనేత ఒకరు అజమాయిషీ చలాయించారు. ఆయన కనుసన్నల్లోనే ఇక్కడ మద్యం ఉత్పత్తి, సరఫరా జరిగింది. ఈ డిస్టిలరీలోనే అక్రమాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందనే అనుమానంతో సీఐడీ బృందం నిశితంగా రికార్డులను పరిశీలించి పలు దస్త్రాలు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. సుందరయ్యపేటలోని జీఎస్‌బీ డిస్టిలరీ సామర్థ్యం కంటే తక్కువగానే ఇక్కడ మద్యం తయారుచేస్తున్నారు.



తనిఖీకి వచ్చిన అధికారులు

గంజాయి రవాణాపై గట్టి నిఘా

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నంలోని అయ్యన్న కాలనీ కూడలి... ఓ మహిళ సహా ముగ్గురు మంగళవారం ఉదయం ఎవరికో సమో ఎదురుచూస్తున్నారు. అటుగా వెళుతున్న పోలీసులకు అనుమానం వచ్చి వారి సంచులను తనిఖీ చేస్తే పదికేజీల గంజాయి పట్టుబడింది.

నర్సీపట్నంలో తరచూ గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఏజెన్సీ నుంచి పట్టణం మీదుగానే రాష్ట్రాలు దాటిస్తుంటారు. దీనికి అడ్డుకట్ట వేసేలా ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రాధాన్యానికి అనుగుణంగా ఎస్పీ నుంచి సీఐ వరకు గంజాయి నేరగాళ్లను కట్టడి చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగుతున్నారు.



గూడెంకొత్తవీధి, చింతపల్లి ప్రాంతాల్లో కేజీ గంజాయి రూ. 2 వేల నుంచి రూ. 3 వేలకు కొనుగోలు చేసి స్థానికంగా గ్రాముల లెక్కన పొట్లాల్లో విక్రయిస్తున్నారు. ఓ వ్యక్తి పదిగ్రాముల గంజాయి పొట్లాన్ని రూ. 100కి విక్రయించడం గమనించి బీసీ కాలనీకి చెందిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏడాది క్రితం నలుగురు యువకులు, ఓ మహిళ రెండు కిలోల సరకుతో పట్టుబడ్డారు. వీరికి విజయవాడలో గ్యాంగ్‌వార్‌లు, వ్యభిచార నేరాలతో సంబంధాలు ఉన్నట్టు పోలీసుల దృష్టికి వచ్చింది. విశాఖపట్నంలో ఇటీవల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకోవడం తెలిసిందే.



నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన వాహనాలు

ఇలాంటివి ఇక్కడా గుట్టుగా విక్రయిస్తూ ఉండొచ్చన్న కోణంలో నిఘా కట్టుదిట్టం చేయనున్నారు. గంజాయిని ద్రవ రూపం పొట్లాలుగా, ఆయిల్‌గా మార్చి ఎగుమతి చేస్తుండటాన్ని గతంలో ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. నర్సీపట్నంలో చాలామంది ఈ వ్యసనానికి బానిసలయ్యారు. అనకాపల్లి ఎస్పీగా తాజాగా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హా గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో, నర్సీపట్నంలో పనిచేశారు. ఆయనకు గంజాయి సాగు, అక్రమ రవాణా తీరుపై పూర్తి అవగాహన ఉంది. ఆయన నేతృత్వంలో గంజాయి నిర్మూలన వేగవంతం కానుంది.

గంజాయి రవాణా నిరోధిస్తాం: నర్సీపట్నం మీదుగా గంజాయి రవాణా నిరోధించేందుకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేస్తాం. జాగిలాల ద్వారా తనిఖీలు ముమ్మరం చేస్తాం. బస్సులు, బైకులు ఇలా అన్ని వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తుంటాం. ఈ వ్యాపారంలో ఎవరెవరు ఉన్నారో ఆరా తీస్తున్నాం. వారిపై నిఘా ఉంచుతాం. ఈ మత్తుకు యువత ఎక్కువగా బానిసవుతోంది. గంజాయి గురించి ఎలాంటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలి. సమాచారం ఇచ్చే వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతాం. – జి.గోవిందరావు, నర్సీపట్నం సీఐ



బాలల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

లక్ష్మీదేవిపేట/కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నాయని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం పేర్కొన్నారు. తొలుత కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌తో సమావేశమయ్యారు. బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం పట్టణంలోని జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో జిల్లా కార్మిక శాఖ అధికారులు చేపడుతున్న చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం గత రెండేళ్లలో జిల్లాలో పట్టుకున్న బాలకార్మికులు తదితర వివరాలను జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కె.వసంతరావును అడిగి తెలుసుకున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు స్త్రీ,శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ, ఇతర శాఖల సమన్వయంతో ఎలాంటి అవగాహన కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేశ్, అసిస్టెంట్ లేబర్ అధికారి బాలకృష్ణ, లేబర్ కమిషనర్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో కమిషన్ సభ్యులు సీతారాం తదితరులు

★ జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో 'బాలల హక్కుల పరిరక్షణలో అధికారుల పాత్ర'పై జరిగిన సమీక్షా సమావేశంలో సీతారాం మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి పెద్ద పీట వేయాల్సిందేనని పేర్కొన్నారు. అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్లలో తల్లులు వారి బిడ్డలకు పాలు ఇచ్చే గదులు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు భిక్షాటన చేయకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని చెప్పారు. జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సహాయ మేనేజర్ రవిచంద్ర, ఆర్టీసీ అధికారులు నర్సింహారావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

స్పందనకు వందన

గొలుగొండ, న్యూస్‌టుడే: నదులు, గెడ్డల నుంచి ఎంత కావాలంటే అంత ఇసుక ఉచితంగా తవ్వి తరలించుకోవచ్చన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనతో రెచ్చిపోయిన మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గొలుగొండ - కొయ్యూరు మార్గంలో బొడ్డేవు గెడ్డలో పదుల సంఖ్యలో టైరు బళ్లతో వచ్చి వంతెనలు, తాగునీటి పథకాల చెంతనే జాతరలా ఇసుక తవ్వకాలు చేయడంపై 'ఉచిత ఇసుక పేరుతో ఊడ్చేస్తున్నారు' శీర్షికన ఈ నెల 21న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాసరావు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో మంగళవారం చోద్యం, లింగంపేట రేవుల వద్ద ట్రాక్టర్లు, టైరుబళ్లు నదిలోకి వెళ్లకుండా పొక్లెయిన్‌తో కందకాలు తవ్వించారు. రెండు, మూడు రోజుల్లో ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



లింగంపేట తాగునీటి పథకం వద్ద కందకం తవ్విస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

పాఠశాలలకు నిధుల విడుదల

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాలకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల నోబల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణ, నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లుగా పాఠశాలలకు నిధులు విడుదల చేయలేదన్నారు. నూతన ప్రభుత్వం పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాల్లో పడుతున్న ఇబ్బందులను గుర్తించి నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. తొలి దశగా 2024-25 ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన నిధుల్లో 50 శాతం విడుదల చేశారు. జిల్లా పరిధిలో 1392 పాఠశాలలకు రూ. 344.15 లక్షలు మంజూరు చేసి దానిలో 50 శాతంగా 172.75 లక్షలను విడుదల చేశారన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, విద్యామంత్రి నారా లోకేష్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



రుషికొండపై రూ.కోట్లు కుమ్మరించి కట్టిన భవనాల ముందు రూ.లక్షలు వెచ్చించి ఎన్నో మొక్కలు, చెట్లు నాటారు. వాటి ఆలనా, పాలనా చూసేవారు కరవై...ఎన్నో ఎండిపోతున్నాయి. లోపలికి వెళ్లే మార్గంలో మోడువారిన చెట్లను చిత్రంలో చూడొచ్చు. –ఈనాడు, విశాఖపట్నం

సామిల్లులో విజిలెన్స్ తనిఖీలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల మండలం అన్నవరంలోని సామిల్లులో అటవీ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ మిల్లులో అక్రమ కలప ఉందనే ఫిర్యాదుపై అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. డీఎఫ్ఓ విజిలెన్స్ అధికారి ధర్మరక్షిత్, నర్సీపట్నం అటవీ అధికారులతో కలిసి, అన్నవరం సామిల్లులో టేకు కర్రను పరిశీలించారు. రికార్డులను కూడా తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారంగానే సామిల్లును నడపాలని, పరిమితి మించి కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులు శంకరయ్య, అప్పారావు, ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



టేకు కలపను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

23, 24, 25 తేదీల్లో పలు రైళ్ల రద్దు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: 'దానా' తుపాను నేపథ్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో తూర్పు కోస్తా రైల్వే పరిధిలో సుమారు 70 రైళ్లను రద్దు చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 23న ఈస్ట్‌కోస్టు, సికింద్రాబాద్- హావ్‌డా ఫలక్‌నుమా, కన్యాకుమారీ- డిబ్రూఘర్- కన్యాకుమారీ, కోణార్క్, చెన్నై సెంట్రల్-హావ్‌డా మెయిల్, విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ తదితర 18 రైళ్లను రద్దు చేశారు. 24న షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్, పట్నా-ఎర్నాకుళం, ఫలక్‌నుమా, భువనేశ్వర్- విశాఖ వందేభారత్, అమరావతి ఎక్స్‌ప్రెస్ తదితర 37 రైళ్లు, 25న విశాఖ-అమృత్‌సర్, విశాఖ-భువనేశ్వర్, విశాఖ-గుణుపూర్, విశాఖ-బ్రహ్మపుర తదితర 11 రైళ్లను రద్దు చేశారు.



అక్కకు సాయంగా వచ్చిన చెల్లిపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పురుడు పోసుకున్న అక్కకు సాయంగా వచ్చిన బాలికపై అక్క భర్త అత్యాచారం చేసిన సంఘటన ఎలమంచిలిలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సావిత్రి కథనం ప్రకారం.. ఎలమంచిలి పట్టణంలోని దర్గవరం ప్రాంతంలో ఓ మహిళకు కొద్ది నెలలకిందట ప్రసవమైంది. బిడ్డతో సహా ఉండటంతో సాయం కోసం 16 ఏళ్ల తన చెల్లిని ఇంటికి తెచ్చుకుంది. ఈమె భర్త కొన్నిరోజులుగా ఆ బాలికపై అత్యాచారం చేస్తున్నాడు. బాలిక సొంతింటికి వెళ్లిపోయిన తరవాత కూడా ఆమెను బెదిరించి పలు మార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే అక్కను చంపేస్తానని బెదిరించడంతో ఇంతకాలం ఎవరికీ చెప్పలేకపోయానంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపుతున్నామన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, అనకాపల్లి

ఆర్.సి. నెం.73/2024 **టెండరు ప్రకటన** తేది. 22-10-2024

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి కార్యాలయమునకు అవసరమైన మనీ వేల్యూడ్ పుస్తకములు, ఫారములు, నోటీసులు మరియు స్టేషనరీ సరఫరాకై ముద్రణాలయములు మరియు ఫర్మ్‌లు నుండి వేరువేరుగా సీల్డు టెండర్లు తేది.28-10-2024ది మధ్యాహ్నం 4-30గం.లోగా ఈ క్రింది సంతకముదారునకు అందినట్టు పంపవలసినదిగా కోరడమైనది. సదరు టెండర్లు. తే. 29-10-2024ది ఉదయం 11-00గంటలకు అప్పటికి హాజరగు టెండరుదార్ల సమక్షములో తెరువబడును.

క్రమ సంఖ్య	వివరములు	అంచనా విలువ	ధరావత్తుగా చెల్లించవలసిన సొమ్ము	టెండరు షెడ్యూలు ఖర్చులు	సరఫరా చేయవలసిన కాలం
1	మనీ వేల్యూడ్ పుస్తకములు ఫారములు మరియు ఇతర రిజిష్టర్లు ముద్రణ మరియు సరఫరా	రూ. 1,00,000	రూ. 2,500	200	15 రోజులు
2	స్టేషనరీ సరఫరా	రూ. 1,00,000	రూ. 2,500	200	15 రోజులు

1. టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తులు సమర్పించినవారు టెండరు షెడ్యూలు ఖరీదు రూ. 200/-ను తేది. 23-10-2024 నుండి 28-10-2024ది మ॥ 1-00 గం॥ వరకు ఈ కార్యాలయము పనిదినములు పనివేళలలో ఈ కార్యాలయములో చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును. టెండరు షెడ్యూల్సు పోస్టు ద్వారా పంపబడవు. ధరావత్తుగా చెల్లించవలసిన మొత్తం Selection Grade Secretary, Agricultural Market Committee, Anakapalli. వారి పేరిట డి.డి. ద్వారా చెల్లించవలెను.
2. ఏదేని ఇతర విషయములు అవసరమైనచో కార్యాలయము పనిచేయు దినములు, పనివేళలలో సంప్రదించవచ్చును.

– పర్సన్ ఇన్‌ఛార్జ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, అనకాపల్లి

టెండరు ప్రకటన

ఆర్.సి. నెం. 69/24 తేది: 22-10-2024

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి డా॥ ఎన్.టి.ఆర్. మార్కెట్‌యార్డు నందు ప్రతి రోజు పూడికపోయిన చెత్తా చెదారములను శుభ్రపరుచుట, యార్డు నందు పెరిగిన గడ్డి మరియు అనవసరమైన మొక్కలను పెకిలించి వేయుచూ సదరు చెత్తను మార్కెట్ యార్డు నుండి బయటికి తరలించి వేయుట, ప్రధాన కార్యాలయము, సులబ్ కాంప్లెక్స్, రైతు విశ్రాంతి భవనము, ల్యాబ్ మరియు ఆసుపత్రి శుభ్రపరుచుట, మరియు మరుగుదడ్లు శుభ్రపరుచుట, ఈ కార్యాలయమునకు సంబంధించి ప్లంబింగ్ పనులు, ప్రధాన కార్యాలయము, రైతు విశ్రాంతి భవనము, ల్యాబ్, ఆసుపత్రి మరియు ప్రధాన కార్యాలయము భవనము శుభ్రపరుచుట మరియు ఈ మార్కెట్ యార్డు నందు గల ఆర్.ఓ. ప్లాంటును మరియు మార్కెట్ యార్డు నందు గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ మెయింటైన్ చేయుటకు గాను రిజిష్టర్డు అర్హత గల వ్యక్తులు/ సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరడమైనది.

పని యొక్క కాలపరిమితి	01-11-2024 నుండి 31-03-2025 వరకు
షెడ్యూలు ఇచ్చు తేదీ	23-10-2024 నుండి 28-10-2024 మ॥ గం॥ 1:00 వరకు
షెడ్యూలు స్వీకరించు సమయం	28-10-2024 మ॥ గం॥ 4:30 ని॥ల వరకు
టెండర్లు తెరుచు తేదీ & సమయం	29-10-2024 ఉ॥ 11:00 గంటలకు

టెండరు నందు పాల్గొనువారు మార్కెట్ కమిటీ కార్యదర్శి వారిని సంప్రదించి మార్కెట్ యార్డు పరిసరములను పరిశీలించుకొనవలెను.

టెండరు నందు పాల్గొనదలచిన వారు కార్యాలయము పనివేళల్లో రూ. 300/-లు చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును.

పర్సన్ ఇన్‌చార్జ్
వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి

ఉత్తరాంధ్ర సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

రైతు సంఘం సదస్సులో వక్తలు


మాట్లాడుతున్న కొణతాల

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో ప్రకృతి వనరులకు లోటు లేదని, అయినా బాగా వెనుకబడిన ప్రాంతంలో ఒకటిగా ఉండని సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ తెలిపారు. అనకాపల్లి రోటరీ కల్యాణ మండపంలో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర సదస్సు నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈనాటికీ ఈ ప్రాంతానికి చెందిన లక్షలాది మంది వలసలు పోతున్నారని తెలిపారు. ఒడిశా, ఆంధ్ర మధ్య వంశధార వివాదం ఉందన్నారు. దీనిని పరిష్కరిస్తే రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వవచ్చని తెలిపారు. నాగావళిపై తోటపల్లి బ్యారేజ్ ద్వారా 15 టీఎంసీల నీరు వాడుకోవచ్చని, ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేస్తే 16 లక్షల ఎకరాలకు సాగు నీరు లభ్యమవుతుందన్నారు. విశాఖలో ఆనాటి ముఖ్యమంత్రి జగన్ కోసం రుషికొండలో రూ. 500 కోట్లతో భవంతి నిర్మించారని, గడిచిన అయిదేళ్లలో ఉత్తరాంధ్రలో సాగు నీటి కోసం ఐదులో సగమైనా ఖర్చు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పోలవరం పనులు పరిశీలించడంతో అనకాపల్లి జిల్లా వచ్చారని గుర్తు చేశారు. వైకాపా హయాంలో పోలవరం, సుజల స్రవంతి వంటి పథకాలు ముందుకు కదలలేదన్నారు. సుజల స్రవంతికి అయిదేళ్లలో కేవలం రూ. 5 కోట్లు ఇచ్చారంటే వైకాపా పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. భూ సేకరణకే రూ. 600 కోట్లు అవసరమని గుర్తు చేశారు. కేంద్ర సహకారంతో పోలవరం వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో 40 వేల చెరువులు ఉంటే వాటిలో సగం ఉత్తరాంధ్రలోనే ఉన్నాయన్నారు. వీటిలో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ సాగు నీటి వనరులకు నిధులు కేటాయించాలని నవంబరు 4 నుంచి దశల వారీగా ఆందోళనలు చేస్తామన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, విశ్రాంతి ఇంజినీర్ నారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నడపాలని ఏఐటీయూసీ నాయకులు మళ్ల మాధవరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.


హాజరైన రైతులు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం

చోడవరం, న్యూస్‌టుడే: వెంకన్నపాలెం సమీపంలో మంగళవారం రాత్రి పది గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దాడి రాము (33) మృతిచెందారు. అనకాపల్లి నుంచి వస్తున్న ఆటోను వెంకన్నపాలెం వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. డ్రైవర్ రాము అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిది మండలం బి.సింగవరం గ్రామం. అనకాపల్లి వెళ్లి చికిత్స పొందుతున్న రోగిని చూసేందుకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.


ప్రమాద స్థలిలో డ్రైవర్ మృతదేహం

ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

నర్సీపట్నం, న్యూస్‌టుడే: కారాగారాల్లో ఖైదీలకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని నర్సీపట్నం కోర్టు సీనియరు డివిజన్ సివిల్ జడ్జి పి. షియాజ్‌ఖాన్ జైలు అధికారులను ఆదేశించారు. స్థానిక ఉప కారాగారాన్ని మంగళవారం సందర్శించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేసి ఆహార పదార్థాలను రుచి చూశారు. వారానికి రెండుసార్లు న్యాయసేవాధికార సంస్థ నియమించిన న్యాయవాది ఎం.గోవర్ధన్‌గిరి జైలును సందర్శిస్తారని, సమస్యలుంటే ఆయన దృష్టికి తీసుకురావచ్చని ఖైదీలకు సూచించారు. జైలు పర్యవేక్షణాధికారి సన్యాసిరావు వెంట ఉన్నారు.


ఖైదీల గదిని పరిశీలిస్తున్న న్యాయమూర్తి షియాజ్‌ఖాన్

ఎలక్ట్రిక్ స్కూటర్లకు వినియోగదారుల ఆదరణ

మాకవరపాలెం, న్యూస్‌టుడే: తామరం పెట్రోల్ బంకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతక్ షోరూమ్‌ను డివిజన్ రీజనల్ మేనేజర్ ఎస్. దీపక్, ఏరియా మేనేజర్ అరుణ్‌కుమార్ వెంకటేశన్ మంగళవారం ప్రారంభించారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్లకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. వరుణ్ బజాజ్ సీఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వాహనాలు కొనుగోలు చేసిన వారితో సిబ్బంది

వసతి గృహాల్లో తనిఖీలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని సంక్షేమ వసతి గృహాలను చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రనాథ్ బాబు తనిఖీ చేశారు. వడ్డాది, దిబ్బిడిలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. విద్యార్థుల గదులు, వంటశాలలను సందర్శించారు. ఎస్సై శ్రీనివాసరావు, సంక్షేమాధికారులు వెంట ఉన్నారు.

30 వేల సభ్యత్వ నమోదు లక్ష్యం: పీలా

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నియోజకవర్గంలో 30 వేల మందికి తెదేపా సభ్యత్వం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మాజీ ఎమ్మెల్యే, పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల కల్పన సంస్థ రాష్ట్ర ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి తెదేపా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో 23 సంఘాలు ఉన్నాయని తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా సీఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను బొండా లక్ష్మికి (గోపాలపురం) రూ. 10 వేలు, జోత్స్న (అనకాపల్లి) రూ. 18 వేలు అందజేశారు. సమావేశంలో నాయకులు కాయల మురళి, బీఎస్ఎంకే జోగినాయుడు, నారపల్లి చంద్రశేఖర్, సబ్బవరపు గణేష్, కొణతాల రత్నకుమారి పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న పీలా

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ

అనకాపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్యం నిర్వహణ సరిగా లేదని, కాలువల్లో వ్యర్థాలు, పూడికలు ఉన్నాయని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనకాపల్లిలో పలు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. పనులు సరిగా చేయడం లేదని పారిశుద్ధ్య విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వం వహిస్తే సహించేది లేదని శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లను హెచ్చరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జోన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. పెరుగుబజారు రహదారి విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి నెల రోజుల్లో టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. నూకాలమ్మ రహదారి విస్తరణ చేపడతామని చెప్పారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారి శివప్రసాద్ రాజు, ఎస్ఈ రామ్మోహనరావు, ఈఈలు చిరంజీవి, ఏడుకొండలు, శేఖర్, ప్రణాళికా విభాగం అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: విశాఖపట్నం నుంచి నర్సీపట్నం వెళ్తున్న కారు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట మంగళవారం రాత్రి డివైడర్‌ను ఢీకొంది. ఎయిర్ బ్యాగులు తెరచుకోవడంతో కారులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జయింది.


ప్రమాదానికి గురైన కారు

దుస్తుల దుకాణంలో అగ్నిప్రమాదం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక ప్రధాన రహదారి పక్కన దుస్తుల దుకాణంలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ. 5 లక్షల విలువైన దుస్తులు దగ్ధమయ్యాయి. వాడ్రాపల్లికి చెందిన పెతకంశెట్టి పూజిత, భాస్కరరావు మునగపాకలో గత ఐదేళ్లుగా దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం దుకాణం తెరిచారు. మధ్యాహ్నం తరవాత మూసివేసి భోజనానికి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో దుకాణంలో మంటలు లేచాయి. పొగలు రావడం గమనించిన పక్క దుకాణాల యజమానులు ఫోన్‌లో సమాచారం అందజేశారు. అప్పటికే అంతా మంటలు వ్యాపించాయి. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.


దగ్ధమైన చీరలను చూస్తున్న దుకాణ యజమాని పూజిత

పిడుగుపాటుకు రైతు మృతి



కోటవురట్ల, న్యూస్‌టుడే: వరి పంటకు ఎరువు జల్లుతుండగా పిడుగు పడి ఓ రైతు మృతి చెందిన ఘటన కోటవురట్ల మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. కోటవురట్ల శివారు రాట్నాలపాలెం గ్రామానికి చెందిన రైతు కాకర కొండబాబు (48) సోమవారం సాయంత్రం రాజుపేట దగ్గరలో ఉన్న పొలంలో వరి పంటకు ఎరువు జల్లడానికి వెళ్లారు. అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు మంగళవారం తెల్లవారుజామున పంట పొలానికి వెళ్లే చూసే సరికి, శవమై ఉండటం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో, వారు ఘటనా స్థలానికి చేరుకుని శవ పరీక్షకు ఆసుపత్రికి తరలించారు. పిడుగు పడి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, చీడికాడ, న్యూస్‌టుడే: అయ్యన్న కాలనీ కూడలిలో పది కేజీల గంజాయితో ముగ్గురు, అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద నాలుగు కేజీల గంజాయితో ఒకరు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. నర్సీపట్నం సీఐ గోవిందరావు, చీడికాడ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో తనిఖీలు చేపట్టగా చింతపల్లి మండలం చెరుకుంపాకలుకు చెందిన తెడ్ల కుమారి, పెద్దయ్యగారి మధుసూదన్ నాయుడు, కిన్నెర్ల గ్రామానికి చెందిన కొర్రా అజయ్‌కుమార్ నర్సీపట్నం పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాడేరు నుంచి నాలుగు కేజీల గంజాయితో వస్తున్న తమిళనాడుకు చెందిన అశ్విన్ సోలోమన్‌ను చీడికాడ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచారు.


గంజాయి నిందితులతో పోలీసులు

మరో ఇద్దరు..

నక్కపల్లి, న్యూస్‌టుడే: కాగిత టోల్‌ప్లాజా వద్ద నాలుగు రోజుల కిందట పట్టుకున్న గంజాయికి సంబంధించి మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ కె.కుమారస్వామి తెలిపారు. ఈనెల 19న మన్యం నుంచి మహారాష్ట్రకు 146 కేజీల గంజాయి కారులో తరలిస్తుండగా, పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. సరకు కొనుగోలు చేసిన వ్యక్తులతోపాటు సరఫరా చేసిన వారికోసం అప్పటినుంచి పోలీసులు గాలిస్తున్నారు. ఈక్రమంలో సరకు పోలీసులు పట్టుకున్న విషయం నిర్ధారించుకోడానికి ముంచంగిపుట్టు మండలం చీడిపుట్టు గ్రామానికి చెందిన ముక్కి చంద్రబాబు, డేగలపుట్టుకు చెందిన పాంగి నరేశ్ మండలానికి వస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న సీఐ మంగళవారం కాపుగాసి ఇద్దరు నిందితులను వేంపాడు వద్ద అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: తురకలపూడి జడ్పీ పాఠశాలను డిప్యూటీ డీఈవో అప్పారావు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజనం రుచి చేశారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగు పాఠం బోధించి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ తాతాజీ పాల్గొన్నారు.


తురకలపూడి పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో

వంట సిబ్బంది మార్గదర్శకాలు పాటించాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో పనిచేసే వంట సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి శ్యామల సూచించారు. ఆరు మండలాల్లోని సంక్షేమ వసతిగృహాల్లో వంట సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వంట గదులు, పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం యాప్రాన్లు పంపిణీ చేశారు. పలువురు వార్డెన్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసరావు



మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగులకు చెందిన శ్రీనాథ శ్రీనివాసరావు ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. శ్రీశైలంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్యవైశ్య సంఘ సమావేశంలో గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్ నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన చెప్పారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్‌డ్	206	240
స్కిన్‌లెస్	234	250

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

రక్షణ గోడ నిర్మించాలని నిరసన

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని ఉడ్‌పేట ఎల్లయ్య కాలువపై తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని మంగళవారం ఆమ్‌ఆద్మీ, బహుజన సమాజ్‌వాది పార్టీ నాయకులు కాలువ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్‌ఆద్మీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు మాట్లాడుతూ వంతెనపై రక్షణ గోడ లేక వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. నాయకులు సూది కొండ మాణిక్యాలరావు, వాహనదారులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర**, రామచంద్ర: **మార్టిన్** ఉదయం, రెండోఆట, **రివైండ్** మేట్నీ. మొదటిఆట, శ్రీ సత్య: **మా నాన్న**, సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం**, స్క్రీన్2: **లవ్‌రెడ్డి**, వెంకటేశ్వర: **వీక్షణం**, పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్**, షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**

అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**



నారాయణపురం సమీపాన అల్లుకున్న తీగపాదు

నిర్లక్ష్యం అల్లుకుంది!

అచ్యుతాపురం, రాంబిల్లి, న్యూస్‌టుడే: తరచూ విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నా సిబ్బంది పనితీరులో మార్పురావడంలేదు. అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్డులో నారాయణపురం సమీపంలో విద్యుత్తు స్తంభం, తీగలను పిచ్చిమొక్కలు అల్లుకున్నా వీటిని తొలగించలేదు. ప్రమాదం జరిగిన తరువాత నివారణ చర్యలు చేపట్టే బదులు ముందుగానే వీటిని తొలగించాలని కోరుతున్నారు.

రహదారులకు కొత్తరూపు ఎప్పుడో!

పాయకరావుపేట, నక్కపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, న్యూస్‌టుడే

ఐదేళ్ల వైకాపా అధ్వాన పాలనకు సజీవ సాక్ష్యాలుగా రహదారులు దర్శనమిస్తున్నాయి. రాళ్లు తేలిన రోడ్లపై ప్రయాణాలు చేయలేక ప్రజలు నరకం చూస్తున్నారు. కొత్తూరు, పాల్తేరు, వెంకటనగరం నుంచి పాల్మన్‌పేట, మంగవరం నుంచి పెంటకోట, గోపాలపట్నం నుంచి గునిపూడి రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. నక్కపల్లి మండలం గొడిచెర్ల, డొంకాడ, దేవవరం, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్లు మరీ ఘోరంగా మారాయి. పెనుగొల్లు నుంచి వమ్మవరం రోడ్డు, పెద ఉప్పలం రోడ్డు దెబ్బతిన్నాయి. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణికులు పాట్లు వర్ణనాతీతం. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తరూపు తెస్తుందనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

✦ నక్కపల్లి మండలం కాగిత నుంచి పాటిమీద గ్రామం మీదుగా అమలాపురం, మూలపర్ర, బోయపాడు, చందనాడ, రాజయ్యపేట గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర మార్గం ఉంది. దశాబ్దాల తరబడి ఇది మట్టి దారిగానే ఉంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ. కోటికి పైగా వెచ్చించి పక్కా రహదారి నిర్మించారు. భారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాల్సిన అధికారులెవరూ ఆ పని చేయలేదు. కనీస మరమ్మతులూ చేయలేదు. దీని మరమ్మతులు చేపట్టకపోతే భవిష్యత్తులో పూర్తిగా రాకపోకలు ఆగిపోయే ప్రమాదం ఉంది.

✦ అచ్యుతాపురం మండలం దోసూరు శివారు కొల్లివానిపాలెం, చిప్పాడ శివారు తమ్మయ్యపేటకు 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం తారురోడ్డు నిర్మించడానికి ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసింది. 3.9 కిలోమీటర్ల పొడవైన రోడ్డు నిర్మించడానికి రూ.2.54 కోట్లు, గండివానిపాలెం నుంచి 2.4 కిలోమీటర్ల దూరంలో ఉన్న



చెరువును తలపిస్తున్న గొడిచెర్ల రోడ్డు

కొల్లివానిపాలేనికి రూ.1.72 కోట్లు విడుదల చేసింది. ఆ తరవాత రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈరోడ్డును నిర్మించడానికి ముందుకురాలేదు. పంచాయతీరాజ్ అధికారులు ఏడు సార్లు రోడ్డు నిర్మాణం కోసం టెండర్లు పిలిచినా పనులు చేయడానికి ముందుకురాలేదంటే వైకాపా ప్రభుత్వంపై గుత్తేదారులకు ఎంత నమ్మకమో అర్థం చేసుకోవచ్చు. చిట్టచివర ఏడాది రోడ్డు పనులను ప్రారంభించినా నిధులు విడుదల కాక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రాంబిల్లి ప్రధాన రహదారిలో గోతులు ప్రమాదకరంగా మారాయి. వెంకటాపురం కూడలి నుంచి నావికాస్థావరం ప్రధాన ద్వారం వరకు 14 కిలోమీటర్ల రహదారిపై గోతుల వల్ల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా అయినా గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.



కాగిత రహదారి దుస్థితి

శాశ్వత మరమ్మతులు చేయాలి: కాగిత రోడ్డులో వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు నిత్యం అనేక మంది ఉంటారు. రోడ్డు దెబ్బతిన్నా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు పరిస్థితి మరీ దారుణంగా మారింది. తక్షణమే దీనికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.– **పోతంశెట్టి రాజేష్, సర్పంచి, కాగిత**

ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నాం: గ్రామానికి సరైన రోడ్డు లేక అచ్యుతాపురంలోనే నివాసం ఉంటున్నాం. అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి వీలుకావడం లేదు. రాత్రి సమయంలో గ్రామానికి వెళ్లడమంటే పెద్ద సాహసం చేసినట్లే. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. – **కొల్లి సత్యారావు, కొల్లివానిపాలెం**

తిరిగి ప్రారంభిస్తాం: నిలిచిపోయిన కొల్లివానిపాలెం, తమ్మయ్యపేట రోడ్డు పనులను తిరిగి ప్రారంభిస్తాం. వేగంగా పూర్తి చేయించడానికి ఇప్పటికే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడారు.

– **వీరభద్రరావు పంచాయతీరాజ్ డీఈ**

త్వరలోనే పనులు: ఈ రోడ్డు పరిస్థితి చూశాం. కొంతమేర దెబ్బతింది, మిగిలింది బానే ఉంది. దీనికి మరమ్మతుల నిమిత్తం ప్రతిపాదనలు పంపితే నిధులు వచ్చాయి. టెండర్లు పిలవాల్సి ఉంది. ఇదీ త్వరలోనే పూర్తవుతుంది. ఈ ప్రక్రియ అనంతరం మరమ్మతులు చేపడతాం. – **ఎన్.కుమారరాజు, డీఈ, పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్సు)**



రాళ్లుతేలిన తమ్మయ్యపేట రోడ్డు



రాంబిల్లి ప్రధాన రహదారి..

విద్యార్థులు పోటీతత్వాన్ని పెంచుకోవాలి

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకుని అన్ని విషయాల్లో పరిజ్ఞానం పొందాలని అనకాపల్లి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బ్రహ్మాజీ తెలిపారు. అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా అంతర్జాలంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యం ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బ్రహ్మాజీ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. సమాజంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు వినియోగించుకోవాలని, దుర్వినియోగం చేస్తే నష్టపోతామన్నారు. దీనిపై విద్యార్థులు ముఖ్యంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థి ఎం.వైభవ్ శ్యాంకుమార్, ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్‌కే చందు, తొమ్మిదో తరగతి విద్యార్థి జి.మోహన్‌సురేష్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె.పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్రహ్మాజీ

అభిజిత్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అభిజిత్ పరిశ్రమ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎలమంచిలిలో సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. పాత జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ యాజమాన్యం అక్రమ లేఆప్‌ను ఎత్తివేయాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కంపెనీ యాజమాన్యం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. నాయకులు రాజు, కూర్మరావు, రాజు, హనుమంతు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అనకాపల్లి పట్టణం, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో బుధవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ రోడ్డు, తాకాశివీధి, మళ్లవీధి, కోట్నివీధి, గాంధీబొమ్మ సెంటర్, చిన్నవీధి, పెరుగుబజార్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పూడిమడక, కడపాలెం, కొండపాలెం, పెద్దూరుల్లో బుధవారం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ తెలిపారు.

రహదారి పనులు పూర్తి చేయరూ!

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ నుంచి స్టేషన్ రోడ్డు వరకు అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంగళవారం సిద్దార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ రహదారి విస్తరణ చేపట్టి మూడేళ్లు కావస్తున్నా పనులు పూర్తి చేయకపోవడం దుర్మార్గమన్నారు. వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ తక్షణమే స్పందించి రహదారి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవో బత్తుల సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. సంస్థ సభ్యులు, స్థానిక దుకాణ యజమానులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో ధర్నా చేస్తున్న సభ్యులు

సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఎలమంచిలి గ్రామీణం: సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా కృషి చేయాలని డీఎల్‌పీఓ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం పోతిరెడ్డిపాలెం, బయ్యవరం, పులపర్తి గ్రామాల్లో సంపద కేంద్రాలను సందర్శించారు. పురుషోత్తపురంలో సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నాగలక్ష్మి పరిశీలించారు. చెత్త సేకరణ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు అందించారు. చెత్తను గ్రామంలో ఎక్కడా నిల్వ ఉంచకుండా సంపద కేంద్రాలకు మాత్రమే తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్‌డీ దీపిక, కార్యదర్శులు ఎస్.ప్రసాద్, సత్యనారాయణ, రామకోటి పాల్గొన్నారు.



బయ్యవరం కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో మూర్తి

భూ నిర్వాసిత సమస్యలు పరిష్కరించండి

నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: పరిశ్రమలకు ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులు ఆర్డీఓ రమణకు వినతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా గ్రామాల్లో ఇప్పటికీ కొందరికి పూర్తిస్థాయిలో పరిహారాలు రాలేదన్నారు. అనంతరం ఆయన ఏపీఐఐసీ భూములతో పాటు, పునరావాసం కోసం స్థలాలను పరిశీలించారు. తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, డీటీ అన్నాజీరావు, సర్వేయరు సత్తిబాబు, నాయకులు పెదపూడి శంకరరావు, గంటా తిరుపతిరావు, గంటా నరసింగరావు పాల్గొన్నారు. రాజయ్యపేట గ్రామ సభలో ఒక వినతిపత్రమే అందింది. ఎండపల్లిలో తహసీల్దార్ తిరుమలబాబు గ్రామ సభను నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు.

అచ్యుతాపురం: రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేయడానికి నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవీ జనార్దన్ కోరారు. మార్టూరులో రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

కశింకోట: కశింకోటలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు దండోరా వేయించకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. సామాజిక భవనంలో నిర్వహించిన గ్రామసభలో 105 అర్జీలను తహసీల్దారు అడబాల శ్రీనివాసరావుకు స్వీకరించారు. డీటీ భాస్కరరావు సర్వేయర్ రామారావు, ఆర్.ఐ.రమేష్, నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, నడిపల్లి సన్యాసిరావు, వేగి వెంకటరావు, తాకాశి కృష్ణ పాల్గొన్నారు.



ఆర్డీఓ రమణతో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 84వ వార్డు కొత్తూరు నరసింగరావుపేటకు చెందిన సీతారామా మహిళా సేవా సంఘం సభ్యులు తమ సంఘానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.



ప్రజల నుంచి వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

రూ.7.50 కోట్లతో యానాద్రి కాలువ అభివృద్ధి

ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు పరచడానికి రూ.7.50 కోట్లతో యానాద్రి కాలువను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్, జలవనరులు, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులతో కలిసి ఈ కాలువను పరిశీలించారు. పాలిథిన్ సంచులను పూర్తిగా నిషేధించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి ఎమ్మెల్యేకు సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష చేశారు. కమిషనర్ బాకూరి ప్రసాదరాజు, నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కరణం రవికుమార్, నైదాన రమేష్, కొఠారు సాంబ, గుర్రాల శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

★ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు అచ్యుతాపురంలో ఎమ్మెల్యేను కలిశారు. యువతకు ఉపాధి కల్పించడానికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

ముప్పు తొలగే వరకూ అప్రమత్తం

నక్కపల్లి, అచ్యుతాపురం: తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, ఎంపీడీఓ డి.సీతారామరాజు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.

★ అచ్యుతాపురంలో రెండు షిఫ్ట్‌ల్లో నలుగురు ఉద్యోగులు వంతున విధుల్లో ఉండేలా తహసీల్దార్ జనార్దన్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 23 నుంచి ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో అందరినీ అప్రమతమత్తం చేశారు.

క్రైం పోలీసుల పేరుతో మోసానికి యత్నం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: 'మేము క్రైం బ్రాంచి నుంచి మాట్లాడుతున్నాం.. మీ అబ్బాయిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేశామంటూ' సైబర్ నేరగాళ్లు ఒక ఉపాధ్యాయుడికి టోకరా ఇవ్వబోయారు. పెంటకోట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహేష్‌కు అపరిచితుడి నుంచి మంగళవారం ఫోన్‌కాల్ వచ్చింది. అవతల వ్యక్తి హిందీలో మాట్లాడాడు. మీ పేరు, ఏం చేస్తుంటారు తదితర వివరాలపై ప్రశ్నించారు. మీ కుమారుడిని డ్రగ్స్ కేసులో అరెస్టు చేశామని చెప్పారు. తొలుత కంగారు పడినా ఆ తర్వాత ఇలాంటి ఫేక్ కాల్స్‌పై అవగాహన ఉండటంతో మాది ఆంధ్రప్రదేశ్, పాయకరావుపేట పోలీసుస్టేషన్‌కు సమాచారమీయ్యండి, వారి ద్వారా మేం తెలుసుంటామని చెప్పడంతో అగంతకుడు కాల్ కట్ చేశారు. దీనిపై ఉపాధ్యాయుడు మహేష్ మాట్లాడుతూ తప్పుడు సమాచారంతో బెదిరించాలని చూశారన్నారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌పై ముందుగానే తెలియడంతో వారి మాటలు పట్టించుకోలేదన్నారు.

29న డెయిరీ ముట్టడి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలను పెంచకుంటే ఈనెల 29న అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో డెయిరీని ముట్టడిస్తామని పాడిరైతులు వంశీ, పీలా కాసుబాబు, భీమునినాయుడు తదితరులు ప్రకటించారు. ఎం.జగన్నాథపురంలో మంగళవారం విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం సమాచారం అందివ్వకుండా వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా పాలధరను అన్యాయంగా తగ్గించారని మండిపడ్డారు. ఇన్నేళ్లు డెయిరీకి అండగా ఉన్నామని తమజీవితాలను రోడ్డుమీదకు లాగితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.



డెయిరీ ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న పాడిరైతులు

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

అచ్యుతాపురం: ఉప్పవరం, యర్రవరం, మళ్లవరం పంచాయతీ కార్యదర్శులు శ్యామల, ఫణీంద్ర బదిలీ అయిన సందర్భంగా సర్పంచులు పిన్నంరాజు వాసు, మాజీ సర్పంచులు చిన్ని శ్రీనివాసరావు, గంగిరెడ్డి రాము మంగళవారం సన్మానించారు. వారి సేవలను కొనియాడి జ్ఞాపికలను అందించారు. ఏఓ కృష్ణ, పీఆర్‌జేఈ నాయుడు, గ్రామపెద్దలు మారిశెట్టి సూర్యనారాయణ, చందక శివ, కండిపల్లి శ్రీను పాల్గొన్నారు.



శ్యామలను సత్కరిస్తున్న సర్పంచులు

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

నక్కపల్లి, ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తక్షణ చర్యలతో వరిలో తెగుళ్లను నివారించుకోవచ్చుని ఏడీఏ ఉమాప్రసాద్ సూచించారు. కాగిత, వేంపాడులో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కలిసి పొలాలను పరిశీలించి తెగుళ్లను గుర్తించారు. ఏఈఓ సత్యనారాయణ, అయినంపూడి అప్పలరాజు, అయినంపూడి మణిరాజు, పల్లా రాంబాబు, కళ్లేపల్లి వెంకటపతిరాజు పాల్గొన్నారు. ఎలమంచిలి ఏఓ మోహనరావు లైనుకొత్తూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వర్షాలకు వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. తెగుళ్ల ఉధృతిని దృష్టిలో ఉంచుకొని మందులు పిచికారీ చేయాలని సూచించారు.

సభ్యులకు డివిడెండ్ పంపిణీ

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక పీఏసీఎస్ ఆర్జించిన లాభాల నుంచి సభ్యులకు దసరా, దీపావళి కానుకగా 15 శాతం డివిడెండ్‌ను అందజేస్తున్నామని సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి ఎన్.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం సొసైటీ ఆవరణలో సభ్యులకు ఆయన డివిడెంటు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో 3,656 సభ్యులకు చెందిన రూ.32,18,368 షేర్‌ధనం ఉందన్నారు. దీనిపై 15 శాతం వంతున రూ.4,82,755 డివిడెండ్ పంపిణీ చేస్తున్నామన్నారు. సీఈఓ ఆడారి వేణుగోపాలరావు, మాజీ అధ్యక్షులు దాడి ముసిలినాయుడు, టెక్కలి వీరకొండలరావు, గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి గంగమహేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యులు డివిడెండ్ అందజేస్తున్న మురళీకృష్ణ

పిచ్చి మొక్కలతో ఇక్కట్లు

ఎలమంచిలి గ్రామీణం: తురంగపాలెం-జంపపాలెం రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. మలుపుల వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ సత్యవాణిని వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని, అనుమతి వచ్చిన వెంటనే తొలగింపు చర్యలు చేపడతామన్నారు.



తురంగలపాలెం-జంపపాలెం రహదారి

ఘనంగా ఆలయ వార్షిక వేడుక

నక్కపల్లి, న్యూస్‌టుడే: కాగితలో దుర్గమ్మ ఆలయ వార్షిక వేడుకలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. రెండురోజులపాటు ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారికి పూజలతో పాటు, ఏకాహం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయం ఎదుటే భారీ అన్నసమారాధన చేపట్టారు.

కూలీలపై తేనెటీగల దాడి

కోటవురట్ల, న్యూస్‌టుడే: చౌడువాడలో కూలీలపై తేనె టీగలు దాడి చేసి సుమారు పదిమందిని గాయపరిచాయి. మంగళవారం ఉదయం పొలం పనికి ఈ గ్రామానికి చెందిన ఎన్.చిట్టితల్లి, ఎన్.లక్ష్మి, ఎస్.చంద్రవతి, కె.చిన్నమ్మలు, ఆర్.చిట్టితల్లి, జి.అచ్చియ్యమ్మ, కె.లక్ష్మి, ఎన్.చిలుకమ్మ, ఎన్.స్వామి, జి.సత్యవతి వెళ్లారు. పొలం పక్కన ఉన్న ముళ్ల మొక్కలను తొలగిస్తుండగా, పక్కనే ఉన్న చెట్టు కొమ్మపై తేనెటీగలు కూలీలపై దాడి చేసి గాయపరిచాయి. వెంటనే కోటవురట్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడంతో వీరికి వైద్యం చేశారు.

ఎన్‌ఏఓబీ భూముల సర్వే అడ్డగింత

ఎస్.రాయవరం: వాకపాడులో నావికా ప్రత్యామ్నాయ స్థావరంకు అప్పగించనున్న భూముల సర్వేను మంగళవారం బంగారమ్మపాలెం మత్స్యకారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ రమేష్‌బాబు, సర్వేయర్ త్రిమూర్తి కలిసి గతంలో నావికా ప్రత్యామ్నాయ స్థావరానికి కేటాయించిన భూముల సర్వే చేపట్టారు. ఇక్కడ పాయింట్ ఏర్పాటు చేసేందుకు ఇసుక తవ్వుతుండగా మత్స్యకారులంతా తమ సమస్యలను పరిష్కరించే వరకు ఇక్కడ పనులు చేపట్టొద్దని అడ్డుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై విభీషణరావు, సిబ్బందితో కలిసి మత్స్యకారులను నిలుపుదల చేయగా, స్వల్ప తోపులాట జరిగింది. దీంతో రెవెన్యూ సిబ్బంది భూముల సర్వేను ఆపేశారు. దీనిపై బుధవారం కలెక్టరేట్‌లో గ్రామానికి చెందిన ముఖ్య నాయకులతో కలెక్టర్ సమావేశం నిర్వహిస్తారని తహసీల్దార్ రమేష్ బాబు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత


కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తే నమూనాలకు రూపకల్పన చేస్తారని నిరూపించారు వెదురుపర్తి జడ్పీ పాఠశాల విద్యార్థులు. ఈ పాఠశాలలో శకుంతలాదేవీ గణిత క్లబ్‌లో విద్యార్థులు మంగళవారం బిస్కట్స్‌తో స్క్వేర్ రూట్స్ నమూనాలను తయారు చేశారు. గణిత ఉపాధ్యాయులు ఏవీ ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను వివరించారు.



వెదురుపర్తిలో విద్యార్థులు బిస్కట్స్‌తో తయారు చేసిన స్క్వేర్ రూట్స్ నమూనాలు

వంతెనలపై వాహనాలతో ఇబ్బందులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: వంతెనలపై వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై తాండవ నదిపై ఉన్న రెండు వంతెనలకు ఇరువైపులా లారీలు, వ్యానులు, భారీ వాహనాలను అడ్డుగా ఉంచుతున్నారు. వీటి వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ ఇక్కట్లు వస్తున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకూడదు. దీనివల్ల పాయకరావుపేట, సీతారాంపురం, నామవరం, పి.ఎల్.పురం తదితర ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆగి ఉన్న వాహనాలను ఢీకొని పలువురు మృత్యువాత పడ్డారు. దీనిపై సీఐ అప్పన్న మాట్లాడుతూ రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపడతామని చెప్పారు.



నిలిచిన వాహనాలు

క్షేత్రస్థాయి పరిశీలనతో అవగాహన

మునగపాక, న్యూస్‌టుడే: పుస్తక పఠనం చేసినంత మాత్రాన విద్యావంతులు కాలేరని, క్షేత్రస్థాయి పరిశీలనతో పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందని ఆంధ్రా విశ్వవిద్యాలయం అసిస్టెంటు ప్రొఫెసర్ రమేష్‌బాబు విద్యార్థులకు సూచించారు. ఏయూలోని ఆర్కిటెక్ట్ బ్రాంచి విద్యార్థులు మంగళవారం మునగపాకలోని బ్రిక్ పరిశ్రమలను సందర్శించారు. నాణ్యత తదితర వివరాలను పరిశ్రమ యజమాని ఆడారి అప్పలనాయుడును అడిగి తెలుసుకొన్నారు. అధ్యాపకులు రాజు, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.



పరిశ్రమలో ఏయూ విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లి శారదానగర్ నాలుగో వీధిలో హైఓల్జేజీతో ఏసీలు కాలిపోయాయి. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలను పరిష్కరించండి. – **శేషగిరిరావు, అనకాపల్లి**

✓: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – **ప్రకాష్, ఏఈ**

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదో విడత మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 26లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్ శ్రీనివాసాచారి తెలిపారు. ఏ ఐటీఐలో ప్రవేశం కోరుతున్నారో ఆ ఐటీఐకే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు మార్కులకోడ్, ఆధార్ వివరాలు, ఎస్ఎస్‌సీ ధ్రువపత్రం వివరాలు సరిపోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఐడీ స్లిప్ ప్రింటు తీసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ఐటీఐలకు వెళ్లి పరిశీలన చేయించుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 28న ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 87907 41378, 89772 72231 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

ఆధార్ సంచార శిబిరాలు ప్రారంభం



మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధార్ అప్‌డేట్, పిల్లలకు కొత్తగా నమోదుకు సచివాలయాల్లో ఏర్పాటైన ఆధార్ సంచార శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎం.కోటపాడు, ఎం.కె వల్లాపురం, ఒమ్మలి గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీవో అప్పారావు ఈ శిబిరాలను పరిశీలించారు.

ప్రతిభను గుర్తించేందుకు దోహదం

'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



వ్యాసరచన పోటీలో విద్యార్థులు

విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను గుర్తించి వెలికితీసేందుకు పోటీలు దోహదం చేస్తాయని గబ్బాడ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుకూరు సత్యనారాయణ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాలాన్ని సక్రమంగా వినియోగించుకుంటే అద్భుతాలు ఆవిష్కరించవచ్చని వ్యాసాల్లో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఎ.వి.ప్రతాప్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన మాకిరెడ్డి యూస్సీ, సింగంపల్లి సాధిక్, పోతల బాలాజీకి హెచ్ఎం సత్యనారాయణ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం సత్యనారాయణ

కుమ్మరి చక్రం గిరగిరా!

చక్రజీవకుల కుటుంబాల్లో దీపావళి | చుంచు బుడ్లు, ప్రమిదల తయారీతో ఉపాధి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే


మట్టి కుండల తయారీని ఉపాధిగా మలచుకుని జీవనం సాగిస్తున్న కుమ్మరి కుటుంబాల్లో దీపావళి వెలుగులు తెచ్చింది. వినాయక చవితి మొదలు దివ్వెల పండగ వరకు ఇంటిల్లిపాదికీ చేతినిండా పని ఉంటోంది. డిమాండు అధికంగా ఉంటే అదనంగా పని వారిని ఏర్పాటు చేసుకుంటుంటారు. మిగతా రోజుల్లో కుండలు, పిడతలు చేస్తుంటారు. ఏ పనీ లేకుంటే ఇటుక బట్టీల్లో పనులకు వెళ్తుంటారు.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ఎనిమిది మండలాల్లో సుమారు 400 కుటుంబాలు ఈ వృత్తిలో ఉన్నాయి. ఏటా వినాయక చవితికి గణనాథుని మట్టి ప్రతిమలు, దీపావళికి చుంచుబుడ్లు, ప్రమిదల తయారీలో నిమగ్నమవుతుంటారు. మూడు నెలలపాటు కుటుంబమంతా చెమటోడిస్తే ఏడాదికి సరిపడా ఆదాయం వస్తోంది. మిగతా తొమ్మిది నెలల్లో చేతినిండా పనిలేకున్నా.. కూలి పనులకు వెళ్తూ పిల్లలను చదివించుకుంటున్నారు.

40 కుటుంబాలు.. 130 మంది



చోడవరం పట్టణ శివారు ఫకీర్‌సాహెబ్‌పేట (పీఎస్‌పేట) కుమ్మరి వీధిలో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరి జనాభా 130 మంది వరకు ఉంది. వీరంతా ప్రతి సంవత్సరం మట్టితో వినాయకుడి ప్రతిమలు తయారు చేసి విక్రయిస్తున్నారు. చిన్న సైజ్ నుంచి మూడు అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను చేస్తున్నారు. చిన్న బొమ్మలు ఒక్కొక్కటి రూ.8 చొప్పున, మూడు అడుగుల బొమ్మలను గరిష్ఠంగా రూ.800 చొప్పున విక్రయిస్తున్నారు. దాతల్లో కొందరు ముందుగా ఆర్డరు ఇచ్చి పండగకు రెండు రోజుల ముందు మట్టి ప్రతిమలను ఉచితంగా పంచుతున్నారు.



రెండు నెలలుగా నిర్విరామంగా..

దీపావళి సందర్భంగా రెండు నెలల ముందు నుంచే చుంచుబుడ్లు, ప్రమిదల తయారీలో నిమగ్నమయ్యారు. వీటి తయారీకి జింకమట్టి, ఇసుక, కొబ్బరి పీచు, చెరకు కట్టును ముడి సరకుగా వినియోగిస్తున్నారు. మిగతా రోజుల్లో నీటి కుండలు, పిడతలు, బొగ్గుల పొయ్యిలు, కర్రల పొయ్యిలు తయారు చేస్తుంటామని చక్రజీవకులు చెబుతున్నారు. వీటిని చోడవరం పరిసర ప్రాంతాలతోపాటు అనకాపల్లి, వడ్డాది, బుచ్చెయ్యపేట, మాడుగుల, సత్యవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం, పాడేరు తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేసి దుకాణాల్లో విక్రయిస్తుంటారు. చుంచుబుడ్డి రూ.3, వంద ప్రమిదెలు రూ.80 చొప్పున కొనుగులు చేసే వ్యాపారులు వినియోగదారులకు రూ.5, రూ. వందకు విక్రయిస్తున్నారు.



ఇదే జీవనాధారం

మా కుటుంబాలకు ఇదే జీవనాధారం. తాతముత్తాతల నుంచి వారసత్వంగా వస్తోంది. రెండు నెలలు కష్టపడి పనిచేస్తే కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. – పొట్నూరు నాగమణి

బ్యాంకు రుణాలు ఇప్పించాలి

చక్రజీవకులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో మా సంక్షేమానికి ఏమీ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకంలో కొందరికి యంత్రాలను పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆశతో ఉన్నాం. బ్యాంకు రుణాలతోపాటు రాయితీపై యంత్రాలను అందిస్తే ఆర్థికంగా మరింత నిలదొక్కుకుంటాం. – గోవిందరావు, చోడవరం



పనులకు వెళ్తుంటాం..: మూడు నెలల కిందటి వరకు కర్రతో చక్రం తిప్పుతూ చుంచుబుడ్లు, ప్రమిదలు తయారు చేసేవాళ్లం. కేంద్ర ప్రభుత్వం యంత్రాలను అందించడంతో ఇప్పుడు వాటిపై తయారు చేస్తున్నాం. సాధారణ రోజుల్లో కూలీ పనులకు వెళ్తుంటాం. – అనకాపల్లి సుబ్బలక్ష్మి



తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి:** విశ్వం, కల్లు కంపౌండ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, **ఆడి2:** వెట్టయన్, ఇద్దరు, **ఆడి3:** దేవర, **ఆడి4:** రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, **రాజు:** వెట్టియన్, విశ్వం, **బంగార్రాజు:** దేవర **చోడవరం: శ్రీసాయిలక్ష్మి:** వెట్టయన్ **సాయిలక్ష్మి:** విశ్వం, **పూర్ణా:** దేవర

అ వీ ఇ వీ

ఉచిత ప్రయాణ హామీ నెరవేర్చాలి

నర్సీపట్నం అర్బన్: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ హామీని వెంటనే అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం మహిళా ప్రయాణికులకు పోస్టు కార్డులు అందజేశారు. హామీ అమలు కోరుతూ ఈ కార్డులను సీఎం చంద్రబాబుకు పంపాలని సూచించారు.

సాగునీటి కాలువల మరమ్మతుకు నిధులు

కృష్ణదేవిపేట: పాతకృష్ణదేవిపేట, ఏఎల్‌పురం, నాగాపురం, పల్లావూరు, కొంగశింగి గ్రామాలకు చెందిన వందల ఎకరాలకు సాగునీరందించే బంగారంపేట ఆయకట్టు కాలువలు, మదుములు శిథిలమయ్యాయి. వీటి మరమ్మతుకు రూ.2 లక్షలు మంజూరుకాగా.. జలవనరుల శాఖ జేఈ రవికిరణ్, నీటి వినియోగదారుల సంఘ ప్రతినిధులు పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు.

డీపట్టాల రద్దుకు డిమాండు

రావికమతం: జగనన్న రీసర్వేలో గిరిజనేతరులకు ఇచ్చిన డి.పట్టాలను రద్దు చేయాలని డిమాండు చేస్తూ కవగుంటలో గిరిజన రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, నాగరాజు, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ శంకరన్ జయంతి

చీడికాడ: సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, ఎస్సీ కార్పొరేషన్ స్థాపనకు ఐఏఎస్ విశ్రాంత అధికారి ఎస్ఆర్ శంకరన్ కృషి చేశారని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జైతవరంలో ఎస్ఆర్ శంకరన్ జయంతి నిర్వహించారు. మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు నాగరాజు, ఈశ్వరరావు, సంతోష్, మంగయ్య, పైడయ్య, స్వామి, తులసీ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే రాజ్యాంగంపై అవగాహన

దేవరాపల్లి: రాజ్యాంగంపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ సూచించారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను అధ్యక్షతన బాలబాలికలకు రాజ్యాంగం, చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

మాడుగుల గ్రామీణం: ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో అప్పారావు చెప్పారు. ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామాల్లోని సంపద కేంద్రాలను పరిశీలించారు.

సమన్వయంతో నిధుల సద్వినియోగం

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సద్వినియోగం కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకుసాగాలని శెట్టిపాలెం సర్పంచి రామునాయుడు అన్నారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధుల పరిచయ వేదిక కార్యక్రమం మంగళవారం ఏర్పాటైంది.

'ఉల్లాస్'తో సంపూర్ణ అక్షరాస్యత

రోలుగుంట: స్వయం సహాయ సంఘాల్లో నూరు శాతం అక్షరాస్యత సాధనకు ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో నాగేశ్వరరావు చెప్పారు. గ్రూపు మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

చోడవరం: నిబంధనలు అతిక్రమించి మద్యం అక్రమాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆబ్కారీ సీఐ పాపునాయుడు హెచ్చరించారు. తెలిపారు. చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని 22 మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

'పల్లె పండగ' పనులకు ఇసుకేదీ?

రోలుగుంట, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండగ' కార్యక్రమంలో ప్రతిపాదిత పనులు చేసేందుకు ఇసుక లభ్యత సమస్యగా మారింది. ఆయా ప్రాంతాలకు నిర్దేశించిన ఇసుక డిపోల్లో నిల్వలు అందుబాటులో లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

రోలుగుంట మండలంలో 37 పనులకు రూ.7.25 కోట్లు, రావికమతం మండలంలో 80 పనులకు రూ.8.33 కోట్లు మంజూరయ్యాయి. ఈ రెండు మండలాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ శంకుస్థాపన చేశారు. ఈ పనులు చేసేందుకు రావికమతంలో 10 టన్నులు, రోలుగుంటలో ఆరు వేల టన్నుల చొప్పున ఇసుక అవసరమవుతుందని పంచాయతీరాజ్ ఏఈ ఉమామహేశ్వరుడు తెలిపారు. ఈ మండలాలకు నిర్దేశించిన చోడవరం డిపోలో ఇప్పటికే ఇసుక నిల్వలు నిండుకున్నాయి. ఈ పరిస్థితుల్లో పనులు ఎలా చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అగనంపూడి, నక్కపల్లి, నర్సీపట్నంలలో ఇసుక డిపోలున్నాయి.. వాటిలో నర్సీపట్నం సమీపంలోని గబ్బాడ డిపోలోనే సుమారు 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. ఈ డిపోలో రెండు రోజుల కిందట విక్రయాలకు శ్రీకారం చుట్టారు. ఇసుక కోసం చాలామంది ట్రాక్టర్లతో బారులుదీరినప్పటికీ సాంకేతిక సమస్య తలెత్తడంతో సోమవారం ఇసుక విక్రయాలకు ఆటంకం ఏర్పడింది.



ఇటీవల రహదారి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజు

ప్రత్యామ్నాయం చూపాలి



ఇసుక విక్రయాలకు సంబంధించి తలెత్తిన సమస్యను దృష్టిలో ఉంచుకుని గనులు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. గ్రామాల్లో 'పల్లె పండగ' పనులతోపాటు ఎన్టీఆర్ గృహాల కోసం లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని ఇసుకను అందుబాటులో ఉంచాలి. – బండారు శ్రీనివాసరావు, సర్పంచి, కంచుగుమ్మల

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. అర్చకులు మంజునాథాచార్యులు, శరత్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం వేదపారాయణం, హోమాలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తాటికొండ బ్రహ్మలింగస్వామి, కార్యనిర్వహణాధికారి సాంబశివరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గౌరమ్మ ప్రతిష్ఠ

రోలుగుంట: కొవ్వూరులో గౌరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది భక్తులు భజనలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచి కాంతమ్మ పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించారు.

దుర్గాదేవి ఊరేగింపు ఉత్సవం

కె.కోటపాడు: గంగాభవానిపాలెంలో దుర్గాదేవి ఊరేగింపు ఉత్సవం వైభవంగా కనులపండువగా జరిగింది. ఉత్సవాల నిర్వహణకు తెదేపా నాయకుడు బండారు నర్సింహనాయుడు రూ.పది వేలు అందజేశారు.



గౌరమ్మను దర్శించుకున్న భక్తులు

వైభవంగా ఒడ్డు పండగ: చౌడువాడలో పెద పైడితల్లి అమ్మవారి ఒడ్డు పండగ మంగళవారం వైభవంగా జరిగింది. కొమార కుటుంబీకుల ఆధ్వర్యంలో గుర్రాలతో ఊరేగింపు కొనసాగింది. అమ్మవారి సారెతో మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి పూజలు చేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సర్పంచి ఎరుకునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రాజేశ్, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, మాజీ అధ్యక్షుడ ఎర్రునాయుడు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయండి

నర్సీపట్నం అర్బన్: రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆగకుండా అవసరమైన చోట్ల స్టాండ్లు ఏర్పాటు చేయాలని సభాపతి అయ్యన్నపాత్రుడు సీఐ గోవిందరావుకు సూచించారు. గిరిజన సహకార సంస్థ బంకు, ఆర్టీసీ బస్టాండు, పాత బస్టాండు, ఎమ్మార్వో కార్యాలయం తదితర చోట్ల స్టాండ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు చెరువుల పరిరక్షణ సంఘ నాయకులు సభాపతిని కలిసి వినతిపత్రం అందజేశారు. సొసైటీ సైంటిస్ట్ పుస్తక రచయిత కలవలపల్లి శ్రీనివాస్ అయ్యన్నను కలిసి పుస్తకం అందజేశారు.



సీఐ గోవిందరావుకు సూచనలిస్తున్న సభాపతి అయ్యన్న

పొగమంచు కమ్మేసింది

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రెండు రోజులుగా ఉదయాన్నే మంచు దట్టంగా కురుస్తోంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో మంగళ, బుధ వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు చేశారు. వర్షం లేకున్నా.. రోలుగుంట, కొత్తకోట, కొంతలం తదితర ప్రాంతాల్లో పొగమంచు కురవడంతో బీఎన్ రోడ్డులో వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. – న్యూస్‌టుడే, రోలుగుంట



క్యాన్సర్ అవగాహన సదస్సు నేడు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథం, మహిళా సాధికారత ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరగనుంది. యువరాజ్‌సింగ్ ఫౌండేషన్ సౌజన్యంతో డాక్టర్ తేజస్విని బృందం ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ చెప్పారు.

కంటి వైద్య శిబిరం

మాకవరపాలెం: ఆంధ్రా బ్యాంకు వద్ద బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు మందుల పంపిణీ, అవసరమైన వారిని విశాఖపట్నం తరలించి శస్త్రచికిత్స చేయిస్తామన్నారు.

సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదు

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పౌర సేవలను విస్తరించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ అధికారుల పర్యవేక్షణ లేక నీరుగారుతోందని భాజపా నాయకులు పేర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే వారంతా సిబ్బంది అందుబాటులో లేక వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. కుసర్లపూడి సచివాలయంలో మంగళవారం ఉదయం 11.45 గంటల వరకు సిబ్బంది ఎవరూ విధులకు హాజరుకాలేదని, సమయపాలన పాటించడం లేదని పేర్కొంటూ భాజపా నాయకులు ఈశ్వరరావు ఫొటోలు, వీడియోలతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో నాగేశ్వరరావును సంప్రదించగా..ఇటీవల జరిగిన బదిలీల తర్వాత ఖాళీలు ఏర్పడ్డాయని, భర్తీ చేయాల్సి ఉందన్నారు.

నిధుల మంజూరు కోరుతూ వినతులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి మంగళవారం వినతులు అందజేశారు. రామయోగి అగ్రహారం నుంచి ఉగ్గినవలస మీదుగా కేజేపురం వరకు మట్టి రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని సర్పంచి కన్నూరు లక్ష్మి, ఉప సర్పంచి అచ్చిబాబు, తెదేపా నాయకుడు నాగభూషణం విన్నవించారు. చౌడువాడకు విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేయాలని, చౌడువాడ నుంచి గుల్లిపల్లి శివారు హిమగిరి కాలనీ వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాని సర్పంచి ఎరుకునాయుడు కోరారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: గరిసింగి, మారేపల్లి, చిననందిపల్లి, ఎన్.గజపతినగరం, వేచలం, ముషిడిపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరఖాన సూర్యనారాయణ, రామ్మూర్తినాయుడు, గొర్రెపోటు రామ్మూర్తినాయుడు, సోమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు, ఉప సర్పంచులు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

పిఠాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదుట అద్దె ఇంట్లో నివసిస్తున్న వివాహిత అనసూరి నాగలక్ష్మి (28) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పిఠాపురానికి చెందిన దుర్గాప్రసాద్‌కు, నర్సీపట్నానికి చెందిన నాగలక్ష్మికి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు అబ్బాయిలు, ఒక పాప ఉన్నారు. దుర్గాప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం పెట్టకుండా ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భార్యను మందలించి బయటకు వెళ్లిపోయారు. తిరిగి వచ్చేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుందని దుర్గాప్రసాద్ పోలీసులకు తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: చోద్యం జడ్పీ పాఠశాలలో మంగళవారం 'సులువుగా రాయడం, చిత్రలేఖనం, పదాల మధ్య సమన్వయం' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నూకరాజు, రమణ, వరప్రసాద్, వాసు, నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం	80085 74743
చోడవరం	80085 74732
మాడుగుల	80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: చౌడువాడ నుంచి చోడవరం మండలం జుత్తాడ దరి శారదా నది వరకు నాలుగు కి.మీ. దూరంలో ఆరు ప్రమాదకర మలుపులున్నాయి. చిట్టిగెడ్డపై వంతెన ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడం ఇబ్బంది అవుతోంది. – భీశెట్టి వెంకటరావు, చౌడువాడ

★ రహదారితోపాటు వంతెనను పరిశీలిస్తాం. నిధులు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. – రమేశ్, ఏఈ



స్పందనకు వందనం

వీధి దీపాల ఏర్పాటు

చోడవరం, న్యూస్‌టుడే: సింహాద్రిపురంలో వీధి దీపాలు వెలగడం లేదంటూ గ్రామానికి చెందిన యువకులు 'మేమున్నాం.. మీకు తోడుగా' వాట్సాప్ ఫొటో పంపారు. సమస్యను సర్పంచి భవాని వద్ద ప్రస్తావించగా స్టాకు రాగానే వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బందితో ఆదివారం వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

రెవెన్యూ గ్రామసభకు వినతుల వెల్లువ

రావికమతం, చోడవరం, న్యూస్‌టుడే: కేబీపీ అగ్రహారంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో భూసంబంధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు వెల్లువెత్తాయి. మండలంలో ఇప్పటివరకు జరిగిన రెవెన్యూ సదస్సులు అన్నింటికన్నా.. కేబీపీ అగ్రహారంలోనే ఎక్కువగా 195 వినతులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దారు అప్పలనాయుడు చెప్పారు. సీతమ్మ చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అంకుపాలెం గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు.

కె.కోటపాడు, దేవరాపల్లి: రీసర్వే గ్రామసభల్లో వచ్చే వినతులకు సత్వరమే పరిష్కారం చూపుతామని తహసీల్దారు భాగ్యవతి చెప్పారు. రొంగలినాయుడుపాలెంలో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. శివప్రసాద్, రాము, అప్పలనాయుడు, నారాయణమూర్తి పాల్గొన్నారు. రీసర్వే తప్పిదాలను సరిచేయాలని కోరుతూ సీతంపేటలో గ్రామసభలో 19 మంది రైతులు ఉప తహసీల్దారు అబ్దుల్ గఫూర్‌కు వినతులు అందజేశారు.



కేబీపీ అగ్రహారంలో వినతులు ఇస్తున్న రైతులు

పూత దశలో మధ్యాహ్నం తర్వాతే మందుల పిచికారీ

రావికమతం, న్యూస్‌టుడే: వరి పూత దశలో ఉన్నప్పుడు మధ్యాహ్నం 3 గంటల తర్వాతే మందుల పిచికారీ చేయాలని నర్సీపట్నం ఏడీఏలు శ్రీదేవి, శ్రీధర్ రైతులకు సూచించారు. గర్నికం, పెదపాచిల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి రూప, సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో వరి పొలాలను పరిశీలించారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ

మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు: ఎం.కోడూరులో వరి విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ తరగతులు జరిగాయి. పీడీ ఆశాదేవి, ఏడీఏలు శ్రీదేవి, శ్రీధర్, ఏవో విజేత, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కె.కోటపాడు ఏవో సోమశేఖర్ సూచించారు. కొరువాడ, గవరపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సర్పంచులు భవాని, నారాయణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు అచ్చిబాబు పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు మరమ్మతు

స్పందనకు వందనం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం ప్రభుత్వాసుపత్రిలో మూలనపడిన అంబులెన్స్‌కు మరమ్మతు చేయించేందుకు అధికారులు ఉపక్రమించారు. 'మూలకునెట్టి.. ప్రైవేటుకు పట్టం' శీర్షికతో ఈ నెల 15న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వైద్య విధాన పరిషత్ అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆసుపత్రి వైద్యాధికారి వినయ్‌కుమార్ మంగళవారం సిబ్బందితో అంబులెన్సును మరమ్మతు నిమిత్తం వేంకటేశ్వరాలయ సమీపంలో మెకానిక్ షెడ్డు వద్దకు తరలించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు ఖర్చు చేయనున్నట్లు సమాచారం. కొన్నాళ్లుగా ఆసుపత్రి గేటు వద్ద ఉన్న ప్రైవేటు అంబులెన్సను అక్కడ్నుంచి తొలగించారు.



మెకానిక్ షెడ్డు వద్ద అంబులెన్సు

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

బాలిక అదృశ్యం

సబ్బవరం, న్యూస్‌టుడే : సబ్బవరం మండలం (88వ వార్డు) గంగవరానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సబ్బవరం సీఐ పిన్నింటి రమణ చెప్పిన వివరాల ప్రకారం.. గంగవరానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. ఈనెల 19న ఉదయం స్కూలుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

పెందుర్తి, న్యూస్‌టుడే

సమస్య: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి దొగ్గవానిపాలెం రాడివారికల్లాలు ప్రాంతంలో 217బి/4 స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగక ఇబ్బంది పడుతున్నాం.
–కె.మురళి, దొగ్గవానిపాలెం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం.
–శివరామ్ ప్రసాద్, ఏఈ, 96వ వార్డు

శారదా పీఠాధిపతిపై ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర గెడ్డ స్థలాన్ని ఆక్రమించి శారదాపీఠం నిర్మించారని, పీఠం ముందు భాగంలోనూ రహదారి స్థలం ఆక్రమించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మంగళవారం పెందుర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. జిల్లా తెదేపా కార్యదర్శి బోడే పూడి దొరబాబు, బీసీ సెల్ నాయకులు దువ్వి పరమేశ్వరరావు, పీతల అప్పారావు, కె.నరేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించరూ..

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ వుడాకాలనీ పరిసర ప్రాంతాల్లో శ్మశానవాటిక లేకపోవడంతో సుమారు పది కాలనీల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు వాపోయారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్లను కలిశారు. వారి సూచన మేరకు మంగళవారం పెందుర్తి తహసీల్దార్ ఎ.ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు విస్సాప్రగడ రాము నేతృత్వంలో కాలనీవాసులు ఎం.వి.ఆర్.పాత్రుడు, కె.వి.ప్రసాదరావు, పి.గోవిందరావు, కృష్ణారావు తదితరులు తహసీల్దార్‌ను కలిశారు.

ప్రభుత్వ భూముల జోలికి వస్తే క్రిమినల్ చర్యలు తప్పవు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో ప్రభుత్వ భూముల జోలికి ఎవరు వెళ్లినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలమేరకు సబ్బవరం మండలంలో ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆరుగురు వ్యక్తులు ఈ భూమి ఆక్రమించి ఉండగా వారిని తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన వివరించారు. ఎవరూ ప్రభుత్వ భూముల జోలికి వెళ్లవద్దని ఆయన తెలిపారు. ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సబ్బవరం తహసీల్దారు చిన్ని కృష్ణ, ఆర్ఐ వీరయ్య

గుంతలు తేలి.. అంచులు చెదిరి..!
సింహాద్రి ఎన్టీపీసీ రహదారి దుస్థితి

పరవాడ, న్యూస్‌టుడే

పరవాడ మండలం వెన్నెలపాలెం నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే రహదారి ఎక్కడికక్కడ ధ్వంసమైంది. పలు ప్రాంతాల్లో గుంతలు పడడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షం పడితే రహదారి చిత్తడిగా మారడంతో పాటు నీరుచేరి గుంతలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారి వెంబడి వెన్నెలపాలెం పరిసర గ్రామాల ప్రజలతో పాటు ఎన్టీపీసీకి వెళ్లే కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వంలో రహదారి దుస్థితికి చేరినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. రహదారి అంచులు ధ్వంసమయ్యాయని, మలుపులు కూడా ఉండడంతో ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్రవాహన చోదకులు వాపోతున్నారు. ఈ మార్గంలో కల్వర్టులకు రక్షణ గోడలు లేవని, ఏ మాత్రం అదుపు తప్పినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కూరగాయల మార్కెట్ వద్ద రహదారిపై గుంతలు


ఇటుకబట్టీల వద్ద దెబ్బతిన్న అంచులు


సింహాద్రి ఎన్టీపీసీ సమీపంలో ఇలా..

పెందుర్తి మీదుగా బస్సులు నడపాలని వినతి

పెందుర్తి, న్యూస్‌టుడే: సింహాచలం డిపో నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగా విజయవాడ వైపు బస్సు సర్వీసులు నడపాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. పెందుర్తి నుంచి విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఈ నేపథ్యంలో పెందుర్తి మీదుగా బస్సులు నడిపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.


ఛైర్మన్ నారాయణరావుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

'ఉల్లాస్' పథకంపై అవగాహన

సబ్బవరం, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు సబ్బవరం మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం అండర్ స్టాండింగ్ ఆఫ్ లాంగ్‌లైఫ్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) అనే పథకం మీద అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీడీవో పి.పద్మజ అధ్యక్షత వహించారు. పథకం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.లక్ష్మణరావు, సెర్ప్ ఏరియా కోఆర్డినేటర్ ఎ.రాజేశ్వరి, సీడీపీవో వి.లలితకుమారి, ఏపీఎం సిహెచ్ శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మహిళా సమాఖ్య సభ్యులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సబ్బవరం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ పేర్కొన్నారు. ఆమె మంగళవారం సబ్బవరం మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాలు పడే సూచన ఉన్న కారణంగా గ్రామ కార్యదర్శులు వారి ప్రధాన కేంద్రంలో ఉండి ఎప్పటి సమాచారం అప్పుడు మండల కేంద్రానికి చేరవేయాలన్నారు. ఇప్పటికే సబ్బవరం తహసీల్దారు కార్యాలయంలో తుపాను కంట్రోల్‌రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవో నారాయణరావు, ఈవోపీఆర్‌డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరం మండలంలోని గ్రామ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

వేగ నిరోధకాలపై రేడియం రంగులు ఏవీ?

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ మండల పరిషత్తు కూడలి, బొంకులదిబ్బ, గండివానిపేట తదితర ప్రాంతాల్లో వేగనిరోధకాలకు రంగులు లేని కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్ల క్రితం ఆయా ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేశారు. వాటిపై తెల్ల రేడియం రంగు వేయకుండా వదిలేశారు. దీంతో రాత్రుళ్లు వాహనచోదకులకు వేగనిరోధకాలు కనిపించకపోవడంతో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: అర్హులైన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పెందుర్తి ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ వి.అర్జునరావు సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు జరిగింది. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీటీ అర్జునరావు హాజరై విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ విషయంలో 18ఏళ్లు నిండిన యువత వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీటీ అర్జునరావు

రైతుల ప్రయోజనానికే రెవెన్యూ సమావేశాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనం కోసమే గ్రామాల్లో రెవెన్యూ సమావేశాలు నిర్వహిస్తున్నామని సబ్బవరం తహసీల్దారు బి.చిన్నికృష్ణ అన్నారు. మంగళవారం సబ్బవరం మండలం చింతగట్ల అగ్రహారంలో గ్రామ రెవెన్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన రీసర్వేలో అనేక తప్పులు దొర్లినట్లయితే వాటిని సవరించుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, రీసర్వే ఆర్ఐ వై.గణేష్, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దారు చిన్ని కృష్ణ

వ్యక్తిగత ఎంపిక ప్రతి ఒక్కరి హక్కు

సబ్బవరం, న్యూస్‌టుడే : వ్యక్తిగత ఎంపిక అనేది ప్రతి ఒక్కరి హక్కు అని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. డీఎస్ఎన్ఎల్‌యూలో మంగళవారం ఫ్యాషన్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్‌లా అధ్యయన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యక్తిగత హక్కులు, ఫ్యాషన్ల ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1)ఎ కింద వ్యక్తిగత ఎంపిక, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు కల్పించబడిందన్నారు. ప్రముఖ న్యాయవాది నమ్రతాపహ్వా మాట్లాడుతూ.. ప్రసిద్ధ సంస్థల సృజనాత్మకతను ఇతరులు దొంగలించినట్లయితే.. అసలైన డిజైనర్ల ప్రయోజనాలను ఎలా పరిరక్షించాలనేదానికి నిర్దిష్ట చట్టాలు లేనపుడు న్యాయస్థానాలు ఎలా వివాదాలను పరిష్కరిస్తాయో ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది నమ్రతాపహ్వాను సత్కరించారు.



సమావేశానికి హాజరైన విద్యార్థులు, నమ్రతా పహ్వాను సత్కరిస్తున్న ఉపకులపతి సూర్యప్రకాశరావు

వృద్ధాశ్రమానికి గుర్తు తెలియని మహిళ అప్పగింత

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి ప్రాంతంలో కొన్నాళ్లుగా రోడ్లపై సంచరిస్తున్న గుర్తు తెలియని మహిళను పెందుర్తి పోలీసులు వృద్ధాశ్రమంలో చేర్పించారు. సుమారు 35 ఏళ్ల వయసున్న మహిళ సరిపల్లి పరిసర ప్రాంతాల్లో రాత్రి, పగలు రోడ్డుపై ఉండడాన్ని గమనించిన కొత్తవలసకు చెందిన బత్తి ఉషశ్రీ పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ పెందుర్తి లయోలా వృద్ధాశ్రమంలో ఆమెకు ఆశ్రయం కల్పించాలని నిర్వాహకులను కోరారు. ఈ మేరకు హెచ్‌సీ దేవుడు, ఉషశ్రీ సంబంధిత మహిళను ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించారు.


ఆశ్రమ నిర్వాహకులకు అప్పగిస్తున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

'కార్మికులను రోడ్డున పడేయడం దారుణం'

పరవాడ, న్యూస్‌టుడే: అచ్యుతాపురం అభిజిత్ కంపెనీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పరవాడ సినిమాహాల్ కూడలిలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థలో విధించిన అక్రమ లేఆఫ్‌లను ఎత్తివేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. వెయ్యి మంది కార్మికులను రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గెదేల అప్పారావు, నాయుడు, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

లంకెలపాలెం(పరవాడ)న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలను ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 320 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు వచ్చే నెల 6, 7 తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ గుర్రం అప్పలరాజు, పరిశీలకులు రాజు, పీడీలు కేఎం నాయుడు, కిరణ్, లక్ష్మి, తులసీ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్‌రావు తదితరులు, ఖోఖో ఆడుతున్న విద్యార్థులు


అతిథుల నుంచి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయిరాం

సంగీత, సాహిత్యాల్లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: శ్రీశ్రీ కళావేదిక, అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళా జాతర కార్యక్రమంలో పరవాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం సీహెచ్‌వో సాయిరాం ప్రతిభ చూపారు. సంగీతం, సాహిత్యంలో ఆయన చూపిన ప్రతిభను మెచ్చుకుని నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. మంగళవారం పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు హారిక, జయశ్రీ, కరిష్మా తదితర వైద్య సిబ్బంది సాయిరాంకు అభినందనలు తెలిపారు.

శునకాల దాడులతో బెంబేలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండడంతో వృద్ధులు, పిల్లలు ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రుళ్లు ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసం దుకాణాల వద్ద లభించే వ్యర్థాలను తింటూ ఈ ప్రాంతంలో తిష్ట వేశాయి. పొలాల్లోని పంటలను పాడు చేయడంతో పాటు ఆవు, గేదె దూడలపై దాడులు చేస్తున్నాయని గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

ఎట్టకేలకు భవిత కేంద్రానికి ప్రహరీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కూడలి సమీపంలోని భవిత కేంద్రానికి ఎట్టకేలకు ప్రహరీని నిర్మించారు. ఈ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యను భవిత కేంద్రం ప్రతినిధులు సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.7లక్షలు కేటాయించారు. ఆ మొత్తంతో కొద్దిరోజుల క్రితం ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించి ప్రస్తుతం పూర్తి చేశారు.



భవిత కేంద్రానికి నిర్మించిన ప్రహరీ

23న బొకారో ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: సాంకేతిక కారణాలతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు (రీ షెడ్యూల్) వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎస్ఎంవీటి బెంగళూరు-అగర్తలా(12503) రైలు ఈనెల 22 ఉదయం 10.15 గంటలకు బదులు 9.45 గంటలు ఆలస్యంగా రాత్రి 8 గంటలకు.. అల్పూజా-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 23న ఉదయం 6 గంటలకు బదులు 4.10గంటలు ఆలస్యంగా ఉదయం 10.10 గంటలకు బయలు దేరేలా మార్పు చేశారు.

ఆదాయపన్ను నిధులు వెనక్కివ్వాలని వినతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయించిన ఆదాయ పన్ను నిధులను వెనక్కి ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద ఆందోళన నిర్వహించి కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఆదాయపన్ను పరిధిలోకి రాకపోయినా జీతాల నుంచి మినహాయించారన్నారు. వెనక్కి వచ్చిన నిధులను కార్మికుల ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, మహిళా సంఘాల ఖాతాల్లో జమచేశారన్నారు. తక్షణమే నిధులు వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు.


కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యుత్ వైర్లకు తగులుతున్న కేబుల్ స్తంభం


వరలక్ష్మీనగర్‌లో విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉన్న కేబుల్‌వైరు స్తంభం


కేబుల్ స్తంభానికి తాకుతున్న విద్యుత్ వైరు

వేపగుంట, న్యూస్‌టుడే : జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మీనగర్‌లో ఓ ప్రయివేటు కేబుల్‌స్తంభం విద్యుత్ వైర్లకు దగ్గరగా ఉండి స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. విద్యుత్ వైర్లు గాలి వేసినప్పుడల్లా కేబుల్ స్తంభానికి తగులుకొని నిప్పురవ్వలు ఎగజిమ్ముతూ కాలనీవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు ఆ కేబుల్ యాజమాన్యంతో సంప్రదించి కేబుల్ స్తంభాన్ని మార్పించడం, లేదా విద్యుత్ వైర్ల దిశను మార్చడమైనా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మురుగు గుంతలు లేకుంటే ఇబ్బందే సుమా!

ప్రహ్లాదపురం (వేపగుంట), న్యూస్‌టుడే : పాత గోశాల కూడలి నుంచి ప్రహ్లాదపురం వెళ్లే ప్రధాన రహదారిలో మురుగు నీరు పోయే ప్రధాన కాలువలు లేకపోవడంతో స్థానికులు మురుగు గుంతలు తవ్వుకుంటున్నారు. ఆ గుంతలు తవ్వకుంటే ఇళ్లలోని వాడుక నీరు రహదారిపైనే ప్రవహించాల్సి వస్తుంది. పెద్ద పెద్ద రహదారులు నిర్మించిన అధికారులు వాటికి పక్కన డ్రైనేజీలు నిర్మించకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. మురుగు గుంతలు నిండిపోయిన తరువాత మురుగు బయటకు పొంగిపొర్లుతుందని దీంతో వాహనదారుల రాకపోకలకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పాత గోశాల నుంచి ప్రహ్లాదపురం రహదారిలో గుంతలో చేరిన మురుగు నీరు